సాక్షి చిత్తూరు

శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,150
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.68,000
రిటైల్ వెండి గ్రాము	రూ.69.00



	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	33	19
తిరుపతి	29	14
తిరుమల	33	18
గూడూరు	33	21
నగరి	33	18



మూడు లక్షల లడ్డూలు సిద్ధం

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల కోసం శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు ప్రసాదాలను సిద్ధం చేస్తున్నారు. ఈసారి మొత్తం మూడు లక్షల లడ్డూలను తయారు చేయిస్తున్నట్టు ఈఓ కేవీ సాగర్‌బాబు తెలిపారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు టేకుమంద విద్యార్థులు



బంగారుపాళెం: అండర్–14 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని టేకుమంద జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుభాన్‌ఖాన్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 17 నుంచి విశాఖ జిల్లా భీమిలీలో నిర్వహించనున్న పోటీల్లో విద్యార్థులు హస్మిత, నిఖిత, వినయ్ కుమార్ పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ రత్నయ్య, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్ అభినందించారు.

రెండోరోజు నామినేషన్లు నిల్!

సాక్షి, చిత్తూరు : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఎమ్మెల్సీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ 18, 19 తేదీలో సెలవు రోజులు కావడంతో నామినేషన్ల ప్రక్రియ ఉండదన్నారు. 20 నుంచి 23వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుందని వెల్లడించారు. 24న నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 27వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు వివరించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు మానస



చౌడేపల్లె : అండర్–14 విభాగంలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని మానస ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాదముని తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో మానస ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. విద్యార్థినిని పీడీ పవన్‌కుమార్, సర్పంచ్ షంషీర్‌బాషా, సింగిల్‌విండో డైరెక్టర్ రమేష్ బాబు, చిన్నప్ప అభినందించారు.

ఎస్వీ సెట్ కళాశాలలో 'కౌంటింగ్'

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో మార్చి 16వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్ పర్యవేక్షిస్తున్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పాలిసెట్ పరీక్షకు ఏప్రిల్ 30వ తేదీ వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు శుక్రవారం వెల్లడించారు. మే 10వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.400 పరీక్ష రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పాలిసెట్ఏపీ.ఎస్‌బీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకు ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే ఎగ్జామినర్లు, చీఫ్, అదనపు సూపరింటెండెంట్లతో సమీక్షలు నిర్వహించారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో ట్రైనీ కలెక్టర్



ట్రైనీకలెక్టర్‌కు వివరాలు తెలియజేస్తున్న జిల్లా రిజిస్ట్రార్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ పనితీరు, ఉద్యోగుల విధుల గురించి జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు వివరించారు. పాత డ్యాకుమెంట్‌ల డిజిటలైజేషన్, సచివాలయాల్లో ప్రారంభం కానున్న రిజిస్ట్రేషన్ సేవలు, ఆన్‌లైన్‌లో మ్యారేజ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తెలియజేశారు. ఈసీ, సీసీ, మార్కెట్ విలువ, చెక్‌స్లిప్, ఈకేవైసీ, ఫొటోలు తీయడం, స్టాంప్ పేపర్స్ తదితర అంశాలను ట్రైనీకలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డ్ రూమ్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రహంతుల్లా, ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ వినోద్ పాల్గొన్నారు.

శోభాయమానం.. శివయ్య ఆలయం



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం లోపల తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తెప్పించిన 27 టన్నుల పుష్పాలు, 45 టన్నుల ఫలాలతో చూడముచ్చటగా అలంకరించారు. విద్యుద్దీపాల వెలుగులు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. శివరాత్రికి మూడు లక్షల మందికిపైగా భక్తులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులను స్వామి, అమ్మవార్ల దర్శనానికి అనుమతించనున్నట్టు ఆలయ ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. - శ్రీకాళహస్తి రూరల్



సుగంధ సుమాలతో కనువిందుగా..



తొమ్మిది రకాల ఫలాలతో ఆకట్టుకునేలా..

పట్టువస్త్రాల సమర్పణ



మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వం తరఫున మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులుతో కలిసి ముక్కంటీశునికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్టు మంత్రి పేర్కొన్నారు. - శ్రీకాళహస్తి

బీసీలు బైబై!

నాడు

గత టీడీపీ ప్రభుత్వం బీసీలను రాజకీయాలకే వాడుకుంది. కేవలం ఓటు బ్యాంక్‌గానే ఉపయోగించుకుంది. చట్టసభల్లోగానీ, రాజకీయ పదవుల్లోగానీ తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అణగదొక్కింది. నామమాత్రంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తూతూమంత్రంగా నిధులు విదిల్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే కూరలో కరివేపాకులా వాడుకుని పక్కనబెట్టింది. చంద్రబాబునాయుడు హయాంలో జరిగిన అన్యాయం బీసీలకు బాగా అర్థమైంది. ఏళ్ల తరబడి మోస్తున్నా.. అడుగడుగునా అవమానాలే ఎదురవుతుండడంతో ఒక్కొక్కరుగా పార్టీని వీడుతూ బాబుకు బైబై చెప్పే పరిస్థితి వచ్చింది.

నేడు

'బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. వారు సమాజానికి బ్యాక్ బోన్‌లాంటి వారు' అని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇదే విషయాన్ని అనేక సందర్భాల్లో ఉచ్చరిస్తూ వారికి అండదండగా నిలుస్తున్నారు. చట్టసభల్లో సైతం వారికి సముచిత స్థానం కల్పించారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన రాజకీయ పదవులు కట్టబెట్టారు. కార్పొరేషన్లకు కావాల్సిన నిధులు సమకూర్చారు. ఆర్థిక అసమానతలు తొలగించేందుకు అనేక పథకాలు తీసుకొచ్చారు. బీసీల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి వేల కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలోనే పలువురు బీసీలు వైఎస్సార్‌సీపీకి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. గతంలో ఎప్పుడూ తమను ఇంతలా ఆదరించలేదని గొప్పగా చెప్పుకుంటున్నారు.



- టీడీపీని వీడుతున్న బీసీ నేతలు
- మొన్న తిరుపతిలో డాక్టర్ సిపాయి.. నేడు చిత్తూరులో షణ్ముగం
- వరుస దాడులు... పార్టీలో గుర్తింపు లేకపోవడమే కారణం
- శివరాత్రి తర్వాత కార్యాచరణ ప్రకటించే అవకాశం!

సాక్షి, తిరుపతి: జిల్లాలోని బీసీ నాయకులు టీడీపీకి గుడ్‌బై చెబుతున్నారు. పార్టీలో సముచిత స్థానంలేక కొందరు.. బాబు సామాజికవర్గం దాడులకు భయపడి మరికొందరు.. చులకన చేసి మాట్లాడడంతో ఇంకొందరు రాజీనామాలు చేస్తున్నారు. ఆ పార్టీలో తగిన గుర్తింపులేక ఒక్కొక్కరూ బయటకు వస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంచి పేరున్న వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం టీడీపీకి, పార్టీ ఇచ్చిన పదవికి రాజీనామా చేశారు. తాజాగా చిత్తూరుకు చెందిన బీసీ నాయకుడు, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పి షణ్ముగం శుక్రవారం ఉదయం టీడీపీకి, తన పదవికి గుడ్‌బై చెప్పారు. ఇదివరకే చిత్తూరు నగర పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన మాపాక్షి మోహన్ టీడీపీకి రాజీనామా చేసిన విషయం తెల్సిందే.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీసీలే అధికం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీసీ సామాజికవర్గం వారే అధికం. మొత్తంగా 15 లక్షలకుపైగా ఓటర్లుండగా వీరిలో వన్నెకుల క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ఓటర్లే సుమారు 40 శాతం ఉన్నారు. కుప్పం, నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో వన్నెకుల క్షత్రియ సామాజికవర్గం ఓట్లే కీలకం. అందుకే వారిలో ముఖ్యమైన కొందరిని ఎంపిక చేసుకుని టీడీపీ నేతలు ఇప్పటికీ ఎన్నికల వరకే వాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బీసీల సాధికారత ఎక్కడ?



బీసీల సాధికారతే లక్ష్యంగా ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. చంద్రబాబు పార్టీని లాక్కున్న తర్వాత ఆ లక్ష్యాన్ని నీరుగార్చారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నానని ప్రకటనలు చేసేవారే తప్ప క్షేత్రస్థాయిలో వారికి చేసింది శూన్యం. చంద్రబాబు హయాంలో బీసీలు దగాపడ్డారు. స్థానిక సంస్థల నుంచి పార్లమెంట్ అభ్యర్థి వరకు వారి సామాజిక వర్గానికి మాత్రమే ప్రాధాన్యం ఇచ్చారు. బీసీలను ఓట్ల కోసం వాడుకుని వదిలేశారు. టీడీపీలో ఎంత కష్టపడినా బీసీలకు న్యాయం, తగిన గౌరవం, గుర్తింపు లభించదు. 15 ఏళ్ల తన రాజకీయ జీవితంలో నన్ను నమ్మిన బీసీల కోసం నేను ఏమీ చేయలేకపోయాను. అందుకే టీడీపీకి రాజీనామా చేశాను.

-డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి

బీసీలను అణగదొక్కేందుకు కుట్ర



టీడీపీ కోసం కష్టపడ్డాను. 32 ఏళ్లుగా పార్టీని నమ్మాను. చంద్రబాబు, లోకేష్, ముఖ్యనాయకులు వస్తే వారి కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించాను. అయితే పార్టీలో నాకు తగిన గుర్తింపు ఇవ్వలేదు. మొన్న లోకేష్ పర్యటనలో పులివర్తి నాని నాపై దాడిచేసేందుకు వచ్చారు. ఈ విషయాన్ని లోకేష్‌కు ఫిర్యాదు చేశాను. నానిపై చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అందుకే టీడీపీకి రాజీనామా చేశాను. చిత్తూరులో బీసీలను అణగదొక్కేందుకు కుట్రపన్నుతున్నారు. బీసీల దెబ్బ ఎలా ఉంటుందో టీడీపీ వారికి రుచిచూపిస్తాం.

- పీ షణ్ముగం, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్, చిత్తూరు

దాడులు చేస్తూ..చులకనగా చూస్తూ

బాబు సామాజికవర్గం నేతలు బీసీలను చులకన చేయడం, పార్టీలో తగిన ప్రాధాన్యత కల్పించకపోవడం వారిని మరింత కుంగదీస్తోంది. మరో వైపు దాడులకు తెగబడుతున్నట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరుకు చెందిన పీ షణ్ముగంపై టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు దాడిచేసినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకే షణ్ముగం ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

ఏకమవుతున్న బీసీలు

టీడీపీలో బీసీలకు జరుగుతున్న అవమానాలను జీర్ణించుకోలేక ఆ సామాజికవర్గ నేతలంతా ఏకమవుతున్నారు. తిరుపతికి చెందిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వన్నెకుల క్షత్రియులతో పాటు మిగిలిన బీసీ సామాజికవర్గం నాయకులు, కార్యకర్తలు రోజూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో టీడీపీ చేసిన అన్యాయాలు, ఆగడాలను ఎండగడుతున్నారు. శివరాత్రితర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీలు సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం.

మొదలైన బుజ్జగింపుల పర్వం

బీసీలు ఒక్కొక్కరుగా పార్టీని వీడితుండడంతో చంద్రబాబు దిద్దుబాటు చర్యలకు దిగారు. పలువురు మాజీ మంత్రులను బీసీ నాయకుల నివాసాలకు పంపుతున్నారు. చేసిన తప్పులను సరిదిద్దుతామని చెబుతున్నట్టు ఆ పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. అయితే టీడీపీకి ఇప్పటి వరకు చేసిన సేవలు చాలని, తమకు ఏ పార్టీ ప్రాధాన్యత కల్పిస్తుందో వారి వెంట నడుస్తామని స్పష్టం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాలు బయటకు రాకుండా ఉండేందుకు పార్టీకి రాజీనామా చేసిన వారిని టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు అధిష్టానం నుంచి లేఖలు విడుదల చేయడం గమనార్హం.

నేడు మదనపల్లెలో 'ఇజ్‌తిమా'





టిప్పుసుల్తాన్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా, సదస్సుకు సిద్ధమైన ప్రాంగణం

మదనపల్లె : అన్నమయ్య జిల్లా మదనపల్లెలో శనివారం నుంచి రెండురోజులపాటు ముస్లిం ధార్మిక సదస్సు తబ్లీగి–ఏ– ఇజ్‌తిమా నిర్వహించనున్నారు. సుమారు 2లక్షల మందికిపైగా ముస్లింలు సదస్సుకు హాజరుకానున్నట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఇందుకు అనగుణంగా స్థానిక కదిరి రోడ్డులోని టిప్పుసుల్తాన్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే వేల సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. కోవిడ్ కారణంగా రెండేళ్లపాటు ఇజ్‌తిమా జరగలేదు. ఈ పర్యాయం ప్రతిష్టాత్మకంగా సదస్సు నిర్వహించేందుకు శ్రమిస్తున్నారు. అందులో భాగంగా వాహనాలకు ప్రత్యేక పార్కింగ్, అతిథుల భోజనాల కోసం తాంఖానాలు, నమాజ్ చేసుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. పట్టణానికి చెందిన ముస్లింలు వలంటీర్లుగా తమ వంతు సేవలందిస్తున్నారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చే జమాత్‌లు బస చేసేందుకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. అలాగే శుక్రవారం టిప్పుసుల్తాన్ మైదానంలో ఇజ్‌తిమా ఏర్పాట్లను రాయచోటి, మదనపల్లె ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, నవాజ్‌బాషా పరిశీలించారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని నిర్వాహకులకు భరోసా ఇచ్చారు. మౌలికవసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్, పోలీస్, రెవెన్యూ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ధార్మిక సదస్సులో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ఇజ్‌తిమాకు కులమతాలకు అతీతంగా ప్రజలు హాజరు కావచ్చని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు హబీబుల్లాఖాన్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌అహ్మద్, మదనపల్లె మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌ఆజం, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరు రఫీ, బావాజాన్ పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు టైలరింగ్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆంధ్రాబ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 22 నుంచి 30 రోజుల పాటు మహిళలకు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెంది తెల్లరేషన్ కార్డు కలిగి, 19 నుంచి 40 సంవత్సరాలలోపు వయసుగల వారు అర్హులని తెలిపారు. కనీసం 10వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి బస్సు చార్జీ, యూనిఫారం ఇవ్వనున్నట్టు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసుకున్నవారికి ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు నేరుగా సంస్థకు వచ్చి వారి పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఒక బ్యాచ్‌కు 25 నుంచి 30 మంది మాత్రమే తీసుకుంటామని, ముందుగా పేరు నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యతను ఇవ్వనునున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివద్ధి సంస్థ, ద్వారకా నగర్, చంద్రగిరి. ఫోన్ 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

20న వాహనాల వేలం

చిత్తూరు అర్బన్: అక్రమ మద్యం, సారా తరలింపులో పట్టుబడ్డ పలు వాహనాలకు ఈనెల 20వ తేదీ బహిరంగ వేలం వేయనున్నట్లు చిత్తూరు రూరల్ ఎస్‌ఈబీ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పూతలపట్టు వద్ద ఉన్న వడ్డేపల్లె బాటిల్ యూనిట్‌లో వేలం వేస్తామన్నారు. జీఎస్టీ నంబరు ఉన్న వాళ్లు వేలంలో పాల్గొనవచ్చని ఆయన సూచించారు.



వ్యవసాయం.. అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యంగా పాడిపరిశ్రమకు ఇతోధికంగా చేయూతనందిస్తోంది. అందులో భాగంగా అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకుని రైతులకు ఆర్థికపురోగతికి కృషి చేస్తోంది. పాల సేకరణలో ప్రైవేట్ డెయిరీల చేతివాటానికి చెక్ పెడుతూ గిట్టుబాటు ధర కల్పిస్తోంది. ఈక్రమంలో మరో పర్యాయం లీటరు పాలపై రూ.3 వరకు రేటు పెంచడంతో రైతన్న మోముపై చిరునవ్వు వెల్లివిరుస్తోంది.



పాలసిరి

- పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- పాల ఉత్పత్తి పెంపునకు కృషి
- పెద్దసంఖ్యలో సేకరణ కేంద్రాల ఏర్పాటు
- లీటరుపై రూ.3 వరకు ధర పెంచిన అమూల్ సంస్థ

జిల్లా సమాచారం

ఆవులు, గేదెలు	:	సుమారు 4 లక్షలు
బల్క్‌మిల్క్ సెంటర్లు	:	37
కొత్తగా మంజూరైనవి	:	271
ఆటోమేటిక్ మిల్క్ సెంటర్లు	:	74
కొత్తగా మంజూరైనవి	:	2,037
రోజూ సేకరిస్తున్న పాలు	:	సుమారు 2లక్షల లీటర్లు

చిత్తూరు అగ్రికల్చర్ : జిల్లాలోని రైతుల్లో 70శాతానికి పైగా పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ మేరకు పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. అమూల్ సంస్థ ద్వారా డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో పాలు సేకరిస్తోంది. అలాగే పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే దిశగా రైతులకు ప్రోత్సాహం అందిస్తోంది. ఈ క్రమంలో ఇటీవల పాడి పరిశ్రమను అతలాకుతలం చేసిన లంపీ స్కిన్ వ్యాధిని కట్టడి చేయడంలో విజయం సాధించింది. వ్యాధి కారణంగా పడిపోయిన పాల ఉత్పత్తి మళ్లీ యథాస్థితి చేరేలా కృషి చేసింది. అమూల్ సంస్థ సైతం ప్రైవేట్ డెయిరీల చేతిలో మోసపోతున్న పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు పాల ధరను మరో పర్యాయం పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో మరింత మంది రైతులు పశువుల పెంపకానికి మొగ్గు చూపేలా దిశానిర్దేశం చేస్తోంది.

'లంపీ' కట్టడి!

జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో పశువులు లంపీ స్కిన్ వ్యాధి బారిన పడడంతో పాల ఉత్పత్తి అధిక శాతం పడిపోయింది. దీంతో అధికార యంత్రాంగం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ముందుగా జిల్లాకు సమీప రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక సరిహద్దులను మూసివేసి పశువుల రవాణాను అరికట్టింది. మొత్తం 4.3 లక్షల పశువులకు లంపీ స్కిన్ నిరోధక టీకా వేయించేందుకు కార్యాచరణ అమలు చేసింది. ప్రత్యేకంగా సంచార పశువైద్య వాహనాలను ఏర్పా టు చేసి ఇప్పటికి వరకు దాదాపు 4.2 లక్షల పశువులకు వ్యాక్సిన్లు వేయించింది. వ్యాధిని సకాలంలో కట్టడి చేయడంతో పశు మరణాలను పూర్తిగా తగ్గించి, పాల ఉత్పత్తిని సాధారణ స్థితికి తీసుకువచ్చింది.

ధర పెంపుతో మరింత ప్రోత్సాహం

జిల్లాలోని పలు మండలాల్లో అమూల్ సంస్థ పాల సేకరణ చేపడుతోంది. చిత్తూరు విజయా డెయిరీని కూడా అమూల్‌కు అప్పగించడంతో త్వరలోనే మరింత విస్తృతంగా పాలు సేకరించనుంది. ఈ క్రమంలో ముందస్తుగా పాడి రైతుల్లో మనోధైర్యం నింపేందుకు జాగ్రత్తలు తీసుకుంటోంది. ప్రైవేటు డెయిరీల దోపిడీని చెక్ పెట్టేలా పాల ధరను అమాంతం లీటరుపై రూ.3 వరకు పెంచింది. దీంతో గరిష్టంగా ఆవు పాలు లీటరుకు రూ.42.56, గేదె పాలు లీటరుకు రూ.85 వరకు చెల్లిస్తోంది.

సంతోషంగా ఉంది



పాల ధర పెంచడం చాలా సంతోషంగా ఉంది. ఇక మీదట ప్రైవేటు డెయిరీలకు పాలు పోసే ప్రసక్తే ఉండదు. ప్రభుత్వం మాలాంటి పాడి రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మా కష్టానికి తగ్గట్టు ప్రతిఫలం దక్కుతోంది.
– జయమ్మ, రైతు, చౌడేపల్లె మండలం

పశువులను కాపాడారు




తమిళనాడు సరిహద్దులో మా గ్రామం ఉంది. అక్కడి నుంచి వచ్చిన పశువుల వల్ల మా గేదెలకు లంపీ స్కిన్ వ్యాధి సోకింది. అయితే అధికారులు వెంటనే స్పందించారు. వ్యాధి నివారణకు వ్యాక్సిన్లు వేయించి మా పశువులను కాపాడారు. ఇప్పుడు ఇదివరకు స్థాయిలోనే పాలు ఉత్పత్తి చేస్తున్నాం.
– అమ్ములు, రైతు, గంగాధరనెల్లూరు

మరింత అండగా నిలుస్తాం



జిల్లాలోని పాడిరైతులకు మరింత అండగా నిలిచేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం. ముందుగా పాల ఉత్పత్తి పెంపుదలే లక్ష్యంగా పెట్టుకున్నాం. పాల సేకరణకు అవసరమైన బీఎంసీయూలు, ఏఎంసీయులను ఏర్పాటు చేస్తున్నాం. అలాగే పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయిస్తున్నాం.
– హరినారాయణన్, కలెక్టర్

ముగిసిన ఆవులపబ్బం



విశేషాలంకరణలో కాటమరాజు

చౌడేపల్లె : మండలంలోని పరికిదొనలో రెండు రోజులుగా నిర్వహించిన ఆవులపబ్బం పండుగ శుక్రవారంతో ముగిసింది. గడ్డంవారిపల్లె, పరికిదొన, ఆమినిగుంట పంచాయతీల్లోని పన్నెండు గ్రామాలకు చెందిన మహిళలు ఉపవాస దీక్ష చేపట్టి ఉదయాన్నే ఊరేగింపుగా కాటమరాజుల ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి , నడివీధి గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆవులపబ్బం వేడుకలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హాజరై కాటమరాజుల వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు, సచివాలయాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్ పాల్గొన్నారు.

చెరుకు ట్రాక్టర్ బోల్తా

కార్వేటినగరం : మండలంలోని కొల్లాగుంట వద్ద మలుపులో శుక్రవారం పుత్తూరు నుంచి వస్తున్న చెరుకు ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ సకాలంలో కిందకు దూకేయడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

సారా విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: రూరల్ పరిధిలోని కొట్టాల గ్రామంలో సారా విక్రయిస్తున్న పి.వినాయకం (52) అనే వ్యక్తిని ఎస్‌ఈబీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

గెలుపే లక్ష్యంగా సమష్టి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

శాంతిపురం : కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని ఎంపీ రెడ్డెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఎంపీ మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో సమన్వయం చేసుకుని ప్రతి లబ్ధిదారుడికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక పాలన అందిస్తున్నారని, ఈ క్రమంలోనే నేతలు సైతం క్షేత్రస్థాయిలో ప్రజాసేవల చేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అందరికీ అందుబాటులో ఉండేందుకే కుప్పంలో ఇల్లు తీసుకున్నానన్నారు. కనీసం 80శాతం ఓట్లు సాధించే దిశగా కార్యాచరణ అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఎంపీ చర్యలు చేపడుతున్నారన్నారు. పక్కా ఇళ్లకు సంబంధించి అర్హుల జాబితాను త్వరితగతిన అందజేయాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రకటించిన రూ.100 కోట్లతో ఏప్రిల్ నుంచి అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 20వ తేదీన శాంతిపురంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రెస్కో మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు చంగప్ప, పెద్దన్న, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

పలమనేరు : మండలంలోని మొరం పంచాయతీ క్యాటిల్‌ఫామ్ వద్ద శుక్రవారం కుప్పం నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. స్థానిక రాజీవ్‌నగర్‌కు చెందిన మురగయ్య(67) బండిపై టిఫిన్, టీ విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బండి తోసుకుంటూ వస్తుండగా బస్సు ఢీకొంది. వెనుకచక్రాల కింద పడిన మురగయ్య అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరులో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శ్మశానకొల్లకు 190 ఏళ్ల చరిత్ర ఉంది. శివరాత్రి మరుసటి రోజు జరిగే ఈ ఉత్సవంలో దక్షప్రజాపతి సంహారం ఘట్టమే ప్రత్యేకం. దీన్ని తిలకించేందుకు రాష్ట్రం తో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి సైతం జనం భారీగా తరలివస్తుంటారు. భారీ భద్రత నడుమ శ్మశానకొల్లను జరిపించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్మశాన కొల్లకు 90 ఏళ్లు



శ్మశానకొల్లలో అమ్మవారి ఊరేగింపు (ఫైల్)

- ఈ నెల 19న చిత్తూరులో మయానసేవకు ఏర్పాట్లు
- భక్తులకు దర్శనమివ్వనున్న అంకాళ పరమేశ్వరి
- కొల్లలో దక్షుడి సంహారం ప్రత్యేకం
- స్థానికులతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి తరలివస్తున్న జనం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సంతపేటలోని నీవానది ఒడ్డున ఏటా శివరాత్రి పర్వదినం మరుసటిరోజు శ్మశానకొల్ల(మయానసేవ)ను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గత 190 ఏళ్లుగా వంశపారపర్యంగా గుర్రప్పనాయుడు వీధి, గిరింపేటలోని వారు శ్మశానకొల్లను ఏటా విజయవంతంగా జరిపిస్తున్నారు. స్థానికంగా వెలసిన శ్రీ అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శివరాత్రి, తరువాత రోజు ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని అలంకరించి విశేష పూజలు చేస్తారు. కఠోర దీక్షలు, నియమాలు పాటించి శ్మశానకొల్ల నిర్వహణకు సిద్ధం అవుతారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నీవానది ఒడ్డున జరిగే శ్మశానకొల్లకు తరలిస్తారు. అక్కడ దక్షుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి దక్ష సంహారం చేయడం ఈ కొల్ల ప్రత్యేకత.

దక్షసంహారమంటే..

పరమశివుడి భార్య సతీదేవి. ఆమె తన తండ్రి దక్షుడు నిర్వహించే యజ్ఞానికి ఆహ్వానం లేకున్నా వెళ్తుంది. అక్కడ అవమానానికి గురై ఆత్మార్పణ చేసుకుంటుంది. ఈ విషయం తెలిసి ఆగ్రహించిన శివుడు తన భార్య మృతికి కారకుడైన దక్షుడిని సంహరించి రమ్మంటూ వీరభద్రున్ని పంపుతాడు. అతడు యజ్ఞం జరిగే చోటుకు వెళ్లి యజ్ఞశాలను ధ్వంసం చేసి దక్షున్ని సంహరిస్తాడు. అప్పటికి శివుడు శాంతిస్తాడన్నది పురాణ కథ. ఈ రకంగా పూర్వీకులు ప్రారంభించిన ఈ దక్షుడి సంహారాన్ని తరువాతి తరాల వారు కూడా ఆచరిస్తున్నారు. అప్పటి నుంచి కూడా దక్షుడి సంహారానికి అంకాళపరమేశ్వరితో పాటు భక్తులు వివిధ వేషధారణల్లో ఉత్సవ మైదానానికి చేరుకుంటారు. అమ్మవారికి ఇష్టమైన పదార్థాలను నైవేద్యంగా సమర్పించి, దక్షుడి సంహార ఘటనను పూర్తిచేస్తారు. అనంతరం దక్షుడి మట్టి కోసం జనం ఎగబడుతారు. ఆ మట్టి ఇంట్లో పెడితే మంచి జరుగుందని భక్తుల నమ్మకం. తరువాతి రోజు సోది అలంకరణలో అంకాళపరమేశ్వరి అమ్మవారు దర్శనమిస్తారు.

పోటెత్తనున్న భక్తులు..

మయానసేవను తిలకించేందుకు రాష్ట్ర ప్రజలే కాకుండా తమిళనాడు, కర్ణాటకవాసులు అధిక సంఖ్యలో వస్తారు. నీవానది ఒడ్డున మొత్తం జనం సందడి నెలకొంటుంది. ఈసారి భక్తుల తాకిడి కూడా అధికంగా ఉండవచ్చని నిర్వాహకులు, పోలీసులు అంచనా వేస్తున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

తరతరాలుగా నిర్వహిస్తున్నాం



అంకాళపరమేశ్వరి ఆశీస్సులతో ఈ మయానసేవ ఉత్సవాన్ని ఏటా పూర్వీకుల అడుగుజాడల్లోనే సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నాం. శివరాత్రి నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు అమ్మవారికి వివిధ అలంకరణ, పూజలు జరుగుతాయి. ఈనెల 19న శ్మశానకొల్ల జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ ఏడాదితో ఈకొల్లకు 190 ఏళ్లు.
– కేఎం.కుమార్, ఉత్సవ నిర్వాహకులు

వేడుకగా ఉత్సవం



తెలుగు రాష్ట్రాల్లో చిత్తూరు శ్మశానకొల్ల ఉత్సవాన్ని వేడుకగా నిర్వహిస్తున్నాం. ఈ ఉత్సవాన్ని చూసేందుకు చిత్తూరు నలుమూలల నుంచి వస్తుంటారు. అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు దక్షుడి మట్టి, అమ్మవారి నిమ్మకాయల కోసం ఎగబడుతుంటారు. భక్తులు వివిధ రూపాల్లో మొక్కులు చెల్లించుకుంటున్నారు.
– కుమార్, అర్చకులు